క్లుప్తంగా

ఘనంగా సుదర్శన నరసింహస్వామి యాగం



సుదర్శన నరసింహస్వామి యాగం జరుపుతున్న వేదపండితులు

మునగపాక : తిమ్మరాజుపేటలో సోమవారం సుదర్శన నరసింహస్వామి యాగం ఘనంగా జరిగింది. వేది పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ యాగంలో 108 మంది దంపతులు పాల్గొని శ్రీనివాసునికి పూజలు చేశారు. కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో భాగంగా యాగం చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

27న ఏకాదశ రుద్రాభిషేకం

మునగపాక : తిమ్మరాజుపేటలో ఈ నెల 27న మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. భగవాన్ సత్యసాయిబాబా శత జన్మ దిన ఉత్సవాల్లో భాగంగా ప్రపంచ శాంతి అలాగే లోక కల్యాణార్థం ఉదయం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి శోభాయాత్ర, గోపూజ, పతాకావిష్కరణ కార్యక్రమాలు ఉంటాయి. భగవాన్ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించే రుద్రాభిషేకంతో పాటు ఇతర కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

నవోదయలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వర్లు

నక్కపల్లి : నవోదయ విద్యాలయాల్లో చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కొమ్మాది నవోదయ విద్యాలయ సిబ్బంది వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆయన మండలంలో పలు పాఠశాలల్లో విద్యార్థులకు నవోదయ విద్యాలయాల ప్రవేశాలపై అవగాహన కల్పించారు. నవోదయ పరీక్షను తప్పకుండా రాయాలన్నారు. నవోదయ విద్యాలయంలో అడ్మిషన్ సాధించగలిగితే ఇంటర్ వరకు మంచి విద్య అందిస్తారన్నారు. అడ్మిషన్ కావాలనుకునే విద్యార్థులు ప్రవేశ పరీక్షకు మంచి తర్ఫీదు పొందాలన్నారు. పాఠశాలల్లోనే ఉపాధ్యాయులు ప్రవేశ పరీక్షకు అవసరమైన శిక్షణ ఇస్తారన్నారు. అన్ని సౌకర్యాలతో కూడిన ఉచిత విద్య అందిస్తారన్నారు. ఈయన వెంట ఎంఈవో నరేష్ ఉన్నారు.

పాటిమీద శివాలయంలో పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న రామకృష్ణ

నక్కపల్లి : మండలంలో పాటిమీద గ్రామ శివాలయం వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పరమేశ్వరుడికి రుద్రాభిషేకం అర్చనలు నిర్వహించారు. పాటిమీద, అమలాపురం, మూలపర, తమ్మయ్యపేట గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సర్పంచ్ సన్యాసిరావు, తళ్ల భార్గవ్, ఎంపీటీసీ గంటా తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రోకళ్ల శ్రీను తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఆర్‌బీకే నిర్మాణ పనుల పరిశీలన

మునగపాక : ఆర్‌బీకే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు కోరారు. తోటాడలో రూ.24లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఆర్‌బీకే పనులను ఆయన సోమవారం పరిశీలించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం పాలన సాగుతుందన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు విజ్ఞానం పెరుగుతుందన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాము ఆయన వెంట పాల్గొన్నారు.

మలుపులో పొంచి ఉన్న ప్రమాదాలు

కోటవురట్ల : ప్రమాదకర మలుపులు..మితిమీరిన వేగం..వెరసి ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి..ఇంటికి క్షేమంగా వెళదామన్న ఆలోచన వాహనదారుల్లో కరువైంది. దీనికి అధికారుల నిర్లక్ష్యం కూడా తోడవ్వడంతో పలువురు మృత్యువాత పడుతున్నారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్న మలుపుల్లో ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో అవి 'డెత్ స్పాట్లు'గా మారిపోయాయి. ఏటా అనేక మంది మృత్యువాత పడుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు, నర్సీపట్నం-రేవుపోలవరం రహదారిలోని పలు ప్రాంతాలలోని మలుపులు, ఘాట్‌రోడ్లు ప్రమాదాలకు హేతువులవుతున్నాయి. జంగిల్ క్లియరెన్సు కూడా లేకపోవడం ప్రమాదాలకు తోడవుతున్నాయి. మలుపులు ఏటవాలుగా ఉండడంతో పాటు పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో ఎదుట వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పాతరోడ్డు జంక్షన్ నుంచి గొట్టివాడ వరకు రెండు ప్రమాదకర మలుపులు ఉన్నాయి. గొట్టివాడ శివారు సాబనాల కొండ, ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్లలో అతివేగం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి నిర్మాణంలోని లోపాల కారణంగా వాహనాలను అదుపుచేయలేక ప్రమాదాలకు గురవుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ మలుపుల్లో పలువురు ప్రమాదాలకు గురై డెత్ స్పాట్‌లుగా మారాయి.



గొట్టివాడ శివారున ప్రమాదకర మలుపు

ఇలాగే రామచంద్రపురం, కైలాసపట్నం, చౌడువాడ, రాజుపేట, ఎల్‌వీకే రోడ్డు, అన్నవరం, బోడపాలెం రహదారుల్లో ప్రమాదకర మలుపులు ఉన్నాయి.

జంగిల్ క్లియరెన్సు లేక..

గ్రామీణ రహదారులన్నీ పిచ్చిమొక్కలతో నిండిపోయి ఉన్నాయి. అసలే ఇరుకు రోడ్లు, ప్రమాదకర మలుపులు కాగా పిచ్చిమొక్కలు మరింత ప్రమాదకరంగా ఉన్నాయి. ఏళ్ల తరబడి జంగిల్ క్లియరెన్సు చేయించకపోవడం వాహనదారులకు ప్రాణాంతకంగా మారాయి. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని, మలుపుల్లో వేగ నిరోధకాలు ఏర్పాటు చేసి, ప్రమాదాలు చోటు చేసుకుంటున్న రహదారులను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

ఎన్నో ప్రమాదాలు

గొట్టివాడ శివారు, ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్లలో ప్రమాదాలు జరుగుతున్నాయి. పాతరోడ్డు దాటాక ప్రమాదకర మలుపు ఉంది. ఇక్కడ ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా మృత్యువాత తప్పదు. రామచంద్రపురం శివారు మలుపులో చాలా సార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాలలో అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– పైల నాని, కె.వెంకటాపురం

చర్యలు చేపడతాం..

ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటాం. మలుపుల్లో జంగిల్ క్లియరెన్సు చేపడతాం. వాహనదారులు మలుపుల్లో జాగ్రత్తలు తీసుకోవాలి.

– నాగమోహన్, డీఈ, ఆర్‌అండ్‌బీ

పేదవాడి కనీస అవసరాలు తీర్చడమే ప్రభుత్వ ధ్యేయం

నక్కపల్లి : ప్రతిపేదవాడికి కనీస అవసరాలు తీర్చడమే ధ్యేయమని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. సోమవారం ఆయన ఉపమాకలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయా లేదా ఆరా తీశారు. అర్హులైన వారికి పథకాలు వర్తించకపోతే వారి పేర్లు నమోదు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. పలువురు స్థలాలు, ఇళ్ల కోసం అభ్యర్థించగా వారి వివరాలు నమోదు చేసుకుని ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మందికి ఇళ్లపట్టాలు పంపిణీ చేసి, వారందరికీ ఇళ్లు మంజూరు చేసామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెప్పారు. ఆయా జగనన్న కాలనీలు ఊళ్లుగా తయారవుతున్నాయని, కాలనీల్లో అన్ని సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్య, తాగునీటి రంగాలకు విశేష ప్రాధాన్యం ఇస్తోందని, జల్ జీవన్ మిషన్ కింద రూ.200 కోట్ల వ్యయంతో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసే కార్యక్రమం చురుగ్గా జరుగుతోందని తెలిపారు. మళ్లీ అధికారంలోకి రావడం కోసం చంద్రబాబునాయుడు బూటకపు హామీలను ప్రకటిస్తున్నారన్నారు. నిజంగా అమలు చేసే చిత్తశుద్ధి ఉంటే అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ప్రజలను ఓటు అడిగే సత్తా తమ పార్టీకే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, ఎంపీటీసీలు కొల్నాటి బుజ్జి, మనబాల దేముళ్లు, పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, పార్టీ సీనియర్ నాయకులు మనబాల తాతారావు, నూకతాత, సత్తిబాబు, రవి, సూరాకాసుల గోవిందు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ, ఏఈ రాజు పాల్గొన్నారు.



ఉపమాకలో ప్రభుత్వం లబ్ధిదారులకు అందించిన పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

పేదలకు భోజన ప్యాకెట్లు పంపిణీ

మునగపాక : ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవరచుకోవాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాకలోని సాంబశివుని ఆలయ ప్రాంగణంలో మునగపాక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిరుపేదలకు భోజన సదుపాయం అందజేస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా సోమవారం సర్పంచ్ అప్పారావు చేతుల మీదుగా పేదలకు భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ మునగపాక సేవా సంస్థ క్రమం తప్పకుండా ప్రతి సోమవారం పేదలకు భోజన వసతి కల్పించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సూర్యప్రకాశరావు, శ్రీరామమూర్తి, అప్పలనాయుడు పాల్గొన్నారు.



పేదలకు భోజనం ప్యాకెట్‌లు అందజేస్తున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

దుప్పతూరులో పశువైద్య సిబ్బంది పర్యటన



మేక పిల్లను పరిశీలిస్తున్న పశు వైద్య సిబ్బంది

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలోని దుప్పతూరులో ఫిమేల్ కాఫ్ జెర్సీ క్రాస్ మేక పిల్ల జన్మించిన రైతు పాకల్ని దోసూరు పశు వైద్యాధికారి వాత్సల్యతో పాటు పశు వైద్య శాఖ సిబ్బంది సోమవారం పరిశీలించారు. మోటూరు రాజు అనే పాడి రైతు మేకకు పార్టెడ్ సెమన్ ఇంజక్షన్ చేయగా మేక పిల్ల జన్మించింది. గోపాలమిత్ర కర్రి రామారావు పర్యవేక్షణలో మేక పిల్ల తల్లికి ఆర్టిఫిషియల్ ఇన్సెమినేషన్ ఇంజక్షన్ వేయగా జన్మించిన మేక పిల్ల,తల్లి ఆరోగ్య స్థితి గతుల్ని పరిశీలించారు. సర్పంచ్ దేశంశెట్టి శంకర్‌రావు, ఎ.అప్పారావు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు మినరల్ మిక్చర్ అందజేశారు.

బాల్య వివాహాలతో భవిష్యత్ ఛిద్రం

గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై డాక్యుమెంటరీ ప్రదర్శన

యలమంచిలి : బాల్య వివాహాలతో భవిష్యత్ ఛిద్రం అవుతుందని తులసీనగర్ సచివాలయ మహిళా పోలీస్ పిళ్లా కుమారి అన్నారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు దిశా పోలీస్‌స్టేషన్ సిబ్బంది, యలమంచిలి పట్టణ సచివాలయాల మహిళా పోలీసుల విభాగంతో యలమంచిలి పట్టణంలో సోమవారం తులసీనగర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, వాగ్దేవి జూనియర్ కళాశాలలో బాల్య వివాహాలపై డాక్యుమెంటరీ ప్రదర్శించారు. జిల్లాలో వివిధ పాఠశాలలు, కళాశాలల్లో ఈ డాక్యుమెంటరీ ప్రదర్శించి బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, మహిళలపై దాడులు, ర్యాగింగ్, మహిళల అక్రమ రవాణా వంటి అంశాలను వివరిస్తూ విద్యార్థులు ఏవిధంగా ఎదుర్కోవాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తులసీనగర్ సచివాలయ మహిళా పోలీస్ పిళ్లా కుమారి విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా కీలకమని తెలిపారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు బాలికలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కళాశాలల్లో, పాఠశాలల్లో ర్యాగింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని, తోటి విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలని తెలిపారు. మహిళల భద్రతకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న మహిళా పోలీసులు

ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోండి

యలమంచిలి : ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరు విధిగా పాటించాలని యలమంచిలి పట్టణ ఎస్ఐ పాపినాయుడు అన్నారు. సోమవారం యలమంచిలి పట్టణంలో పలువురు డ్రైవర్‌లకు ఎస్ఐ పాపినాయుడు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో నిషేధించిన స్థలాల్లో వాహనాలు నిలుపుదల చేయరాదని, ఆటోలు, ట్రక్కులు ఒక ప్రదేశంలో నిలిపి వాటిని సీరియల్ వారిగా పట్టణంలోకి అనుమతించాలని, జన సంచారం గ ప్రాంతాల్లో వేగ నియంత్రణ పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడరాదని, వాహన రికార్డులు సక్రమంగా ఉండాలని, పరిమితికి మించిన ప్రయాణికులతో వాహనాలు నడపరాదని డ్రైవర్లకు సూచించారు.



డ్రైవర్లతో మాట్లాడుతున్న పట్టణ ఎస్ఐ పాపినాయుడు

9మంది పేకాట రాయుళ్ల అరెస్టు

మునగపాక : రామారాయుడుపేట శివారున పేకాడుతున్న 9మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముందస్తు సమాచారంతో ఆదివారం రాత్రి సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేయగా 9మంది పట్టుబడ్డారని, వారి నుంచి రూ.22,350 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ మహమ్మద్ అలీ తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

ఉత్తమ అధికారులకు సత్కారం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండల పరిషత్ సమావేశం సోమవారం ఎంపీపీ కోన సంధ్య బుజ్జి అధ్యక్షతన ప్రశాంతంగా జరిగింది. ముందుగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్తమ ఉద్యోగ అవార్డులు అందుకున్న ముగ్గురు అధికారులను సమావేశంలోని సభ్యులు సత్కరించారు. మండల పరిషత్ ఏవో కృష్ణ, ఏపీఈపీడీసీఎల్ ఏఈ, మడుతూరు కార్యదర్శులను సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. పనులు చేసినప్పటికీ బిల్లులు చెల్లించడం లేదంటూ ఆర్‌డబ్ల్యూస్ అధికారులపై మల్లవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు, ఎంపీటీసీ జువ్వాల నాయుడు, లాలం శ్రీనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సర్పంచ్ పదవికి గానూ రావాల్సిన గౌరవ వేతనం విడుదల అయినట్టు కనిపిస్తుందని, కానీ తనకు అందడం లేదని దోసూరు సర్పంచ్ సుజాత పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంబంధిత పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందకపోవడంతో ఎంపీడీవో ఆధ్వర్యంలో విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ లాలం రాంబాబు సూచించారు. కో-ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, సర్పంచ్ దేశంశెట్టి శంకర్‌రావు, ఎంపీడీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.



ఉత్తమ ఉద్యోగ అవార్డులు పొందిన వారిని సత్కరిస్తున్న అచ్యుతాపురం మండల పరిషత్ సభ్యులు

దోమల నివారణతో వ్యాధులు దూరం

యలమంచిలి : దోమలను నివారించడం వల్ల ప్రాణాంతక వ్యాధులు బారి నుంచి రక్షణ పొందవచ్చని డాక్టర్ సౌమ్య అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా సోమవారం యలమంచిలి శ్రీ గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు దోమల వల్ల ప్రబలే వ్యాధులు, నివారణ జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. మలేరియా, డెంగ్యూ, వైరల్ ఫీవర్‌లు దోమల వల్లే వస్తాయని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమలను నివారించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ సర్ రోనాల్డ్ రాస్ అనే శాస్త్రవేత్త 1897 ఆగస్టు 20వతేదీన దోమలపై పరిశోధనలు జరిపారని ప్రతి ఏటా దోమల దినోత్సవంగా ప్రపంచంలో జరుపుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జంతు శాస్త్రం అధ్యాపకులు ఎ.అర్జున అప్పారావు, కె.సుజాత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చిట్టిబాబు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు విద్యార్థులు పాల్గొన్నారు.



దోమల వ్యాప్తిపై వివరిస్తున్న డాక్టర్ సౌమ్య

అర్హులైన బార్క్ నిర్వాసితులకు న్యాయం చేయాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని బార్క్ సేకరించిన భూమికి సంబంధించి తంతడి రెవెన్యూ పరిధిలో గుర్తించిన నిర్వాసితుల జాబితాలో అవకతవకలు చోటుచేసుకున్నాయంటూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సోమవారం అచ్యుతాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గుర్తించిన నిర్వాసితులు జాబితాను కాదని మరొక జాబితాను రూపొందించారని, ఆ జాబితాలో అనర్హులు ఉన్నారని ఆరోపించారు. మ్యాప్ విడుదల చేసి అసలైన లబ్ధిదారులకు పరిహారం అందజేయాలని వారు డిమాండ్ చేశారు.



అచ్యుతాపురం మండల కార్యాలయాల సముదాయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

చిరుజల్లులతో ఉపశమనం

నక్కపల్లి : ఉదయం నుంచి ఎండ వేడిమికి అల్లాడిపోయిన ప్రజానీకం సోమవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో ఉపశమనం పొందారు. చిరుజల్లులు పడ్డాయి. ఒక్కసారిగా చల్లని వాతావరణం ఏర్పడి వర్షం పడడంతో ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం సాయంత్రం మండలంలో పలు చోట్ల వర్షం పడింది. నాట్లు వేసి వర్షాలు పడక ఆందోళన చెందుతున్న అన్నదాతలకు ఈ వర్షపు చినుకులు కొంతమేర ఉపశమనం కలిగించాయి. ఈ మోస్తరు జల్లులు నారు ఎండిపోకుండా కొంతమేర ఉపయోగ పడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తెగిన హెచ్‌టీ విద్యుత్ లైన్

త్రుటిలో తప్పిన ప్రమాదం

రాంబిల్లి : దిమిలి శివాలయం వీధిలో సోమవారం హెచ్‌టీ విద్యుత్ లైన్ తెగి రోడ్డుపై పడింది. పోస్టాఫీస్‌కు ఎదురుగా ప్రాథమిక పాఠశాల పక్కనే వున్న బొప్పాయి చెట్టు ఆకులు తీగలను తాకి మంటలు చెలరేగాయి. కొంతసేపటికి చెట్టు తీగలపై పడింది. దీంతో తీగలపై పడిన చెట్టు పై భాగం రోడ్డుపై పడి తీగలు తెగిపోయాయి. ఈ తీగలు రోడ్డుపై పడిపోవడంతో వెంటనే సమీపంలో వున్న ఉన్న పలువురు అప్రమత్తమయ్యారు. వెంటనే లైన్‌మెన్ తాతారావుకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. విద్యుత్ సరఫరాను నిలిపివేసి సంఘటనా స్థలానికి లైన్‌మెన్‌తో పాటు వాటర్ ఆపరేటర్ ధర్మ చేరుకున్నారు. తీగలను సరి చేసారు. తీగలు రోడ్డుపై పడిన సమయంలో ఎవరూ రోడ్డుపై లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. తీగలను తాకవద్దంటూ వలంటీరు డబ్బీరు రాము, లక్ష్మణ్‌లు స్థానికులను అప్రమత్తం చేశారు.



విద్యుత్ తీగలపై బొప్పాయి చెట్టు కూలిన దృశ్యం

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరస్వతిదేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అధ్యాపక బృందం

కోటవురట్ల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుల తల్లి సరస్వతీదేవి విగ్రహాన్ని సోమవారం ప్రతిష్ఠించారు. కళాశాలలో పనిచేస్తున్న కామర్స్ లెక్చరర్ కె.బి.హెచ్.ఎస్.ఆచార్యుల దంపతుల ఆర్థిక సహాయంతో ప్రిన్సిపాల్ కొండబాబు, అధ్యాపకులు విగ్రహావిష్కరణ చేశారు. సరస్వతీదేవికి పూజలు చేశారు. ప్రిన్సిపాల్ కొండబాబు మాట్లాడుతూ చిన్నతనం నుంచి ఆధ్యాత్మిక భావన ఉంటే మంచి మార్గంలో నడిపిస్తుందన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో కొత్తపేట విద్యార్థుల ప్రతిభ

యలమంచిలి : చిత్ర లేఖనం పోటీల్లో కొత్తపేట విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆగస్టు 13వ తేదీన చైన్నైకి చెందిన శ్రీదర్శిని కల్తై కూడమ్ ఫైన్ ఆర్ట్స్ కళాశాల వారు ఇక్కడ 6వ తరగతి నుండి,10వ తరగతి వరకు విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 11 మంది విజేతలకు బహుమతులు, మెడల్స్ సోమవారం పాఠశాలలో అందజేశారని డ్రాయింగ్ ఉపాధ్యాయురాలు రాజేశ్వరి తెలిపారు. విజేతలను ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.



పోటీలలో బహుమతులు పొందిన విద్యార్థులు

ఉప ఎన్నికల్లో విజేతలకు సన్మానం





రేబాక వార్డు సభ్యురాలు బుజ్జమ్మ, చినదొడ్డిగల్లు వార్డు సభ్యుడు నానాజీని సన్మానిస్తున్న దృశ్యం

నక్కపల్లి : మండలంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో విజేతలకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. రేబాక పంచాయతీ పదో వార్డుకు సాదిరెడ్డి బుజ్జమ్మ, చినదొడ్డిగల్లు ఒకటో వార్డుకు నాయుడు నానాజీని ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్,ఎవిశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీలు ఈశ్వరరావు, మండలానికి చెందిన పలువురు సర్పంచ్‌లు సాదిరెడ్డి శ్రీను, తళ్ల భార్గవ్, కొండలరావు, ఎంపీటీసీలు తిరుపతిరావు, సత్తిబాబు తదితరులు అభినందించారు.

సర్వశిక్ష ఒప్పంద ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

రాంబిల్లి : సర్వశిక్ష అభియాన్ ఒప్పంద ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని మండల జేఏసీ అధ్యక్షుడు టి. నర్సింహమూర్తి కోరారు. సోమవారం రాంబిల్లి ఎంఈవో కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పలు డిపార్ట్‌మెంట్‌ల్లో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులకు న్యాయం చేసిన జగనన్న తమను కూడా ఆదుకోవాలని కోరారు. పాదయాత్ర సమయంలో జగనన్న తమకు న్యాయం చేస్తారని ప్రకటించార న్నారు. కార్యక్రమంలో లోవరాజు, గణేష్, ప్రసాద్, అప్పారావు పాల్గొన్నారు.



రాంబిల్లి ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మూర్తి తదితరులు

రహదారి ఏర్పాటుకు వినతి

కోటవురట్ల: టి.జగ్గంపేట శివారు గ్రామాలైన తడపర్తి, శ్రీరాంపురం, కెవెంకటాపురం శివారు బోనుకొత్తూరు గ్రామాలకు సంబంధించి రహదారి దారుణ స్థితిలో ఉంది. కె.వెంకటాపురం నుంచి శ్రీరాంపురం వరకు రహదారి 5 కిలోమీటర్లు కాగా గతంలో కె.వెంకటాపురం నుంచి బోను కొత్తూరు వరకు ఒకటిన్నర కిలోమీటర్లు, తడపర్తి నుంచి శ్రీరాంపురం వరకు అర కిలోమీటరు వరకు రహదారిని అభివృద్ధి చేశారు. మధ్యలో బోనుకొత్తూరు నుంచి తడపర్తి వరకు 3 కిలోమీటర్ల వరకు అటవీశాఖ పరిధి కావడంతో రోడ్డు నిర్మాణాన్ని నిలిపివేశారు. అయితే ఒకటిన్నర కిలోమీటర్లు మాత్రమే అటవీ శాఖకు చెందినదని, మిగతా ఒకటిన్నర కిలోమీటర్లు ప్రభుత్వ భూమిగా గిరిజనులు చెబుతున్నారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్ రవి పట్టాన్ శెట్టికి వివరించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరినట్టు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆర్.ఎస్.సత్యనారాయణరాజు తెలిపారు. మూడు గ్రామాల గిరిజనులతో కలిసి తహసీల్దారు జానకమ్మకు వినతిపత్రం అందజేశారు.

భూవివాదంలో 11 మంది బైండోవర్

మునగపాక : కాకరాపల్లిలో ఇటీవల జరిగిన వివాదానికి సంబంధించి 11 మందిని బైండోవర్ చేసినట్టు పోలీసులు తెలిపారు. సర్వే నంబర్ 185లో 1.48 ఎకరాలకు సంబంధించి రెండు వర్గాల మధ్య గొడవలు జరిగిన నేపథ్యంలో కర్రి నాగిరెడ్డి తనకు చెందిన పామాయిల్ తోటతో పాటు పైప్‌లైన్ ధ్వంసం చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఇటీవల రెండు వర్గాల వారితో చర్చలు జరిపారు. తహసీల్దార్ ప్రకాశరావు, ఎంపీడీవో మన్మథరావు, ఎస్ఐ అలీలు రెండు వర్గాల వారితో చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో భూ వివాదానికి సంబంధించి నాగిరెడ్డి తరపున ముగ్గురు అలాగే మరో వర్గం నుంచి 8 మంది వెరసి 11 మందిని బైండోవర్ చేసినట్టు పోలీసులు తెలిపారు. కేసు ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్నందున గొడవలకు దిగకుండా శాంతియుతంగా నడుచుకోవాలని అధికారులు సూచించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

రాంబిల్లి : దిమిలి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం దిమిలి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీహెచ్‌వో ఎస్ఎస్‌వీఎన్ రాజు పర్యవేక్షణలో వైద్య సిబ్బంది ఈ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు అందజేసారు. పౌష్టికాహారం తీసుకుంటూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని రాజు సూచించారు.